క్లుప్తంగా

జాతీయస్థాయికి ఎంపిక


యోగానంద్

దామెర: టార్గెట్ బాల్ జాతీయస్థాయి పోటీలకు మండల కేంద్రంలోని శ్రీహర్ష ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న యోగానంద్ ఎంపికైనట్లు కరస్పాండెంట్‌లు మేరుగు శివానంద్, రాచమల్ల వెంకటరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. నర్సంపేటలో ఈ నెల 26, 27 వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి టార్గెట్‌బాల్ పోటీల్లో యోగానంద్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2 వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు మహారాష్ట్రలోని షిర్డీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో యోగానంద్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి, పీఈటీ జన్ను రమేష్‌ను డైరెక్టర్లు శివానంద్, వెంకటరాజు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సమ్మయ్య (ఫైల్)

ఎల్కతుర్తి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోతులనడుమ గ్రామానికి చెందిన తనుగుల సమ్మయ్య (45) మరో వ్యక్తి దుండ శ్రీనివాస్‌తో కలిసి ఇటీవల ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో కోతులనడుమ బ్రిడ్జిపై ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో సమ్మయ్యకు తీవ్ర గాయాలుకాగా 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సమ్మయ్య మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ..

నడికూడ: మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన దయ్యాల అనూష మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనూష మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బల్లు రమేష్, నాగరాజు, నారాయణ, బొమ్మకంటి చంద్రమౌళి, అజయ్, రాకేష్, సంపత్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ఆత్మకూరు : మండలంలోని విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని ఏఈ రవికుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో విద్యుత్ బిల్లుల ప్రక్రియను పరిశీలించారు. వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. బిల్లులను పెండింగ్‌లో ఉంచొద్దని కోరారు.

ప్రభుత్వానికి చలనం లేదు..



పరకాల: రాష్ట్రం, దేశంలో వైద్య ఆరోగ్యశాఖ చాలా కీలకమైందని, అలాంటి శాఖకు చెందిన ఉద్యోగులు 14 రోజులుగా ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పట్టణంలో 14 రోజులుగా సమ్మె చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు మంగళవారం ఆయనకు వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఉద్యోగిని మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఉద్యోగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. తక్షణమే రెండో ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సునీత, రజిత, భాగ్యలక్ష్మి, కరుణ, కల్పన, ఇందిర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన సీఎం



కమలాపూర్ : గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల పరుశరాములు ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, మైనారిటీ, గిరిజన, దళితులు, తదితర వర్గాలకు కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారని, కానీ ఏ ఒక్కటి నెరవేర్చలేదని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల హామీల వైఫల్యాలను వివరిస్తూ మంగళవారం నాయబ్ తహసీల్దార్ మమతకు వినతిపత్రం అందించారు. ఇచ్చిన హామీలను గుర్తు చేసే విధంగా ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కస్తూరి ముత్యాలు, శనిగరపు రవీందర్, బండిరాజు, కిషోర్, సల్పాల కుమారస్వామి, సుధాకర్, వీరన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

● జిల్లా వ్యాప్తంగా ఘనంగా క్రీడా దినోత్సవం


ఎల్కతుర్తి : బహుమతులు అందజేస్తున్న సునీతారాణి


ఆత్మకూరు : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై



దామెర : క్రీడా దినోత్సవం సందర్భంగా ఏకశిల పాఠశాలలో విద్యార్థుల విన్యాసం


ఐనవోలులో..


కమలాపూర్‌లో..

ఎల్కతుర్తి: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందని వ్యాయమ ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్ అన్నారు. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పద్మవిభూషన్ అవార్డు గ్రహిత, ఖేల్‌రత్న అవార్డు దక్కించుకున్న క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అజ్మీరా సర్దార్ కబడ్డీ క్రీడాకారులకు రూ.5వేల విలువ గల కబడ్డీ కిట్‌లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతరాణి విద్యార్థులకు రాగిజావ తాగేందుకు గ్లాసులు బహుమతిగా అందించారు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమరేందర్‌రెడ్డి, సర్దార్, చారి, దయాకర్, కృష్ణమూర్తి, మల్లేశం, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐనవోలు: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకే గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని ఎంపీపీ మార్నేని మధుమతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అండర్ 14, 17 బాలురు, బాలికల కబడ్డీ, వాలీబాల్, ఖోఖో మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం జరిగాయి. క్రీడాపోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభించారు. క్రీడల విభాగాల నుంచి ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి రెండు టీంలను ఎంపిక చేసి సెప్టెంబర్ నెలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేష్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, హెచ్‌ఎంలు శ్రీహర్షుడు, శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు సురేష్, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, ప్రేమ్‌ప్రసాద్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేట : ఇటీవల జరిగిన త్రో బాల్ మహిళా విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులను స్థానిక సర్పంచ్ రవి మంగళవారం సన్మానించారు. తెలుగుభాష, క్రీడదినోత్సవం సందర్భంగా సన్మానం చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ మాసంలో సిద్దిపేటలో జరిగే త్రో బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన క్రీడాకారులు శ్వేత, చైతన్య, శరణ్య, లావణ్య, ధనలక్ష్మి, మహాలక్ష్మి, మానస, కవితలతో పాటు పీఈటీ, కోచ్‌ను శాలువాతో సన్మానించారు.

కమలాపూర్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడా మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించి ఎంపిక చేశారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఎంపీడీఓ పల్లవి, ఎంఈఓ రామ్‌కిషన్‌రాజు, నేషనల్ హాకీ క్రీడాకారుడు పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సంజీవ్, సర్పంచ్ అంకతి సాంబయ్య, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, మెండు రాధిక, ప్రిన్సిపాల్‌లు మల్లయ్య, ప్రఫుల్లాదేవి, హెచ్‌ఎం పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రు, మండల కార్యదర్శి రాజు, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దామెర: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఏకశిలా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ చిదురాల దినేష్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రం సమీపంలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడలతో శారీరక ధారుఢ్యం పెంపుదలతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. ఈ సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్‌డే ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు మంచినీళ్ల ప్రభాకర్, విజయ్, రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై ప్రసాద్ సూచించారు. మండలంలోని నీరుకుళ్ల హైస్కూల్‌లో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపికలు జరిగాయి. ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. సర్పంచ్ ఆర్షం బలరాం, ఎంపీటీసీ వరుణ్‌గాంధీ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీఈటీలు శ్రీధర్, గ్రేసమ్మ, కిషన్, సుమలత, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలి


సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

ఐనవోలు: కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టగా ఆయన హాజరై సభ్యత్వాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తిచేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు డీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. మధ్యంతర భృతి (ఐఆర్)ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి పెండెం రాజు, సీఎస్ఆర్ మల్లిక్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనుముల రవీందర్, బాలోజు బ్రహ్మచారి, సభ్యులు రాము, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ధర్మసాగర్: మండలంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గర్భిణులను గుర్తించి ఆన్‌లైన్ ప్రక్రియ నమోదును పూర్తి చేయాలని అన్నారు. ఐరన్ మాత్రలు, వాడే విధంగా ప్రోత్సహించి, ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ అయ్యే విధంగా చూడాలని సూచించారు. చిన్న పిల్లలకు సరైన సమయానికి టీకాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి గోపీనాథ్, సీహెచ్‌ఓ మాదవరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి దళితబంధు ఇవ్వాలి


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని ప్రతీ దళిత కుటుంబానికి వర్తింపచేయాలని డీవైఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఎస్ఎస్ నాయకుడు మొగ్గం సుమన్ మాట్లాడుతూ హుజురాబాద్ తరహాలో ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు పథకం వర్తించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకం ఎంపికలో అధికార పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా చూడాలని, గతంలో బీఆర్ఎస్ అనుచరులకు మాత్రమే వర్తించేలా ఎంపిక చేశారని మండిపడ్డారు. ప్రతీ నిరుపేద దళిత కుటుంబానికి దళితబంధు వర్తింపజేయని పక్షంలో దళిత ప్రజలను, దళిత సంఘాలను ఏకం చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు


కాల్షియం ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ దీపిక

ఎల్కతుర్తి: మండలంలోని దామెర గ్రామంలో వికాసతరంగిణీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశువైద్యాధికారి వెంకట్‌నారాయణ, రిటైర్డ్ జేడీ సుభాష్‌రెడ్డి హాజరై సుమారు 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు చేశారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. లేగదూడలకు నట్టల నిరవాణ మందు, పాడిగేదెలకు క్యాల్షియం పౌడర్ తినిపించాలని సూచిస్తూ రైతులకు ప్యాకెట్లను అందించారు. మండల పశువైద్యాధికారి దీపిక, డాక్టర్ దయాకర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ గొర్రె ఆదామ్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషతోనే ప్రతిఒక్కరికీ సంపూర్ణ పరిజ్ఞానం ..



పరకాల : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్


శాయంపేట : తెలుగు భాషపై సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

పరకాల: మాతృభాషతోనే ప్రతిఒక్కరికీ సంపూర్ణ పరిజ్ఞానం పెంపొందుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సంతోష్‌కుమార్ అన్నారు. మంగళవారం తెలుగు విభాగం, సాహిత్య సాంస్కృతిక విభాగాల ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ విద్యార్థి తెలుగు భాష పట్ల పట్టు సాధించాలని ఆయన కోరారు. అదే విధంగా తల్లిదండ్రులు చిన్నతనం నుంచే పిల్లల్లో తెలుగు భాష పట్ల మక్కువను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి మోరె అశోక్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ నవీన్, డాక్టర్‌లు అరుణ, సుస్మిత, రాజయ్య, ఓదెలు, రవికుమార్, శ్రీనివాస్, స్వప్న, రాజు, సంజయ్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

కమలాపూర్ : గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తస్లీం నజ్రీన్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలతో అలంకరించి ప్రార్థనగీతం ఆలపించారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషాధారణలతో చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు పద్య పఠన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహాయకులు శారద, తెలుగు ఉపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : విద్యార్థులు తెలుగు భాషపై మరింత పట్టు సాధించాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తెలుగు భాషపై పరిజ్ఞానం పెంచుకోవాలని అన్నారు. తెలుగు భాష ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, సుధాకర్, సురేందర్, సుజాత, నవ్య పాల్గొన్నారు.

‘చల్లా’కు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

పరకాల: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఆర్ఎస్ మొదటి జాబితాలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మున్సిపాలిటీ గదుల కిరాయిదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డిని శాలువాతో సన్మానించారు. దుప్పటి సాంబశివుడు, దాసరి రమేష్, వేముల సుధాకర్, ఖాజామొయిద్దీన్, సలీం, అలీ, నర్సయ్య, రాంబాబు, భరత్, సత్యం నాయకులు తదితరులు ఉన్నారు.